

ఎట్టకేలకు కేసు నమోదు

- మాజీ ఎమ్మెల్యేతో పాటు మరో ముగ్గురిపైనా..
- అరెస్టు చేసేందుకు రంగంలోకి దిగిన పోలీసులు!



పలమనేరు, ఆగస్టు 9: సీఎం నుంచి ఆదేశాలొస్తే కానీ పలమనేరు పోలీసులు స్పందించలేదు. క్వారీ యజమాని ఫిర్యాదుపై మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడతో పాటు మరో ముగ్గురిపైన కేసు నమోదు చేశారు. ఫిర్యాదు అందిన తక్షణమే కేసు నమోదు చేశామని పేర్కొనడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి. పలమనేరు మండలం మాది గబండ సమీపంలోని తన క్వారీలో ఉన్న వాహనాలను మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అక్రమంగా తరలించుకుపోయారని జూన్ 8వ తేదీన జనార్దన నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పలమనేరు సీఐ చంద్రశేఖర్ పట్టించుకోలేదు. దీంతో ఆయన నేరుగా సీఎం చంద్రబాబును కలిసి వైసీపీ మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వాకాన్ని వివరించారు. వైసీపీ అధికారంలోకి రాగానే అప్పటి పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తన క్వారీని బలవంతంగా స్వాధీనం చేసుకొన్నారని, లీజుకోసం ఆయన ఇచ్చిన చెక్కు కూడా చెల్లక తాను ఇబ్బంది పడ్డానని చెప్పారు. జూన్‌లో ఎన్నికల ఫలితాలు రావడంతో తాను క్వారీ వద్దకు వెళ్లగా అప్పటికే తన వాహనాలను వెంకటేగౌడ తీసుకెళ్లిపోవడంపై సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేస్తే కేసుకూడా నమోదు చేయలేదని వివరించారు. ఈ కేసులో బాధితుడికి న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. దీంతో పోలీసులు జనార్దన నాయుడిని పిలిపించి మళ్లీ ఫిర్యాదు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడతోపాటు బైరెడ్డిపల్లె మండలం గౌనితిమ్మేపల్లెకి చెందిన దయానంద గౌడ, వి.కోట మండలం కుంబార్లపల్లెకు చెందిన శరత్‌కుమార్, తోటకనుమ గ్రామానికి చెందిన మంజునాథ్ క్వారీలోని రెండు హిటాచీలు, ఒక బ్రేకర్, రెండు టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను బలవంతంగా తీసుకెళ్లిపోయారని ఆ ఫిర్యాదులో జనార్దననాయుడు పేర్కొన్నారు. దీనికి పలమనేరు మండలం కొలమాసనపల్లెకి చెందిన సెల్వ సహకరించినట్లు ఫిర్యాదులో ప్రస్తావించారు. దీనిపై ఏఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు. నలుగురిపై 303(2), 318(4) రెడ్‌విత్ 3(5) బి.ఎన్.ఎస్. కింద కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, మరో ముగ్గురినీ అరెస్టు చేసేందుకు పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో అందరినీ అరెస్టు చేయడం ద్వారా ఉన్నతాధికారుల్లో తనపై ఉన్న కోపాన్ని చల్లార్చుకోవాలని సీఐ చంద్రశేఖర్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

కేసు నమోదులో తిరకాసు

తన వాహనాలు తీసుకెళ్లారని జనార్దన నాయుడు జూన్ 8వ తేదీనే ఫిర్యాదు చేశానని అప్పట్లో జనార్దన నాయుడు చెప్పారు. ఎఫ్ఐఆర్‌లో మాత్రం ఈనెల 6వతేది రాత్రి వాహనాలను తీసుకెళ్లారని 7వతేది సాయంత్రం 5.30 గంటలకు జనార్దన నాయుడు ఫిర్యాదు చేశారని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా కేసు నమోదు చేశామని పేర్కొనడం గమనార్హం. జూన్‌లో ఫిర్యాదు చేస్తే ఆగస్టు 6న వాహనాలను తీసుకెళ్లిపోయారంటూ కేసు నమోదైంది. ఇంత పెద్ద కేసును స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించే సీఐ చంద్రశేఖర్.. లేదా ఎస్ఐ కాకుండా ఏఎస్ఐ కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్‌లో ఈకేసు నుంచి సాంకేతికంగా తనకు బాధ్యత లేదని తప్పించుకొనేందుకే సీఐ ముందుచూపుతో ఏఎస్ఐ వద్ద కేసు నమోదు చేయించి ఉంటారని అందరూ భావిస్తున్నారు.

సీఐ బదిలీకి టీడీపీ నాయకులే బ్రేక్!

కూటమి అధికారంలోకి రాగానే వైసీపీతో అంటకాగిన పోలీసు అధికారులను వరుసగా బదిలీ చేస్తున్న విషయం తెలిసిందే. పలమనేరులో మాత్రం సీఐని బదిలీ చేయక పోవడానికి కారణం ఇక్కడి తెలుగుదేశం పార్టీ నాయకులే బ్రేక్ వేయిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే సీఐల బదిలీలు మూడు సార్లు జరిగినప్పటికీ అందులో పలమనేరు సీఐ చంద్రశేఖర్ పేరులేకపోవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ సీఐ తీరును నిరసిస్తూ టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగిన సంగతీ తెలిసిందే. అయినా, కొందరు టీడీపీ నాయకులు మాత్రం సీఐ చంద్రశేఖర్‌ను బదిలీ చేస్తే ఆయన అక్రమాలు వెలుగులోకి రావని అయనను ఇక్కడే ఉంచి అక్రమాలకు లెక్కకట్టి ఇంటికే పంపాలని చూస్తున్నారని రాజకీయవర్గాల్లో చర్చసాగుతోంది.

సీఐపై ప్రైవేటు కేసు వేస్తా

పలమనేరు సీఐ చంద్రశేఖర్‌పై తాను కోర్టులో ప్రైవేటు కేసు వేయనున్నట్లు క్వారీ యజమాని జనార్దననాయుడు తెలిపారు. ఐదేళ్ల తనను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పెట్టిన వెంకటేగౌడకు సీఐ అన్ని విధాలా సహకరించారని ఆరోపించారు. జూన్‌లో లక్షలాది రూపాయల విలువచేసే వాహనాలు తీసుకెళ్లిపోవడంతో తాను ప్రతిరోజూ వేలాది రూపాయలు నష్టపోయానన్నారు. ఫైనాన్సులో తీసుకున్న వాహనాలకు సకాలంలో కంతులు చెల్లించలేక కంపెనీల వద్ద డిఫాల్టరుగా మారాల్సి వచ్చిందన్నారు. ఇది తనకు, తన వ్యాపారానికి సంబందించి పేరుప్రతిష్టలకు తీరని నష్టాన్ని కలిగించిందన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో తనకు తెలియదన్నారు. తద్వారా తనకు వచ్చే రిలీఫ్ ఏమీ లేదని ఆయన అన్నారు. అందుకని తనకు జరిగిన నష్టాన్ని సీఐ చంద్రశేఖర్ నుంచి రాబట్టుకొనేందుకు ప్రైవేటు కేసు వేయనున్నట్లు శుక్రవారం తెలిపారు.

పలువురు సీఐల బదిలీలు

చిత్తూరు, ఆగస్టు 9: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారంతా రెండు రోజుల్లో తమకు కేటాయించిన సర్కిల్ పోలీసు స్టేషన్లలో బాధ్యతలు తీసుకోవాలని ఆ ఉత్తర్వులో పేర్కొంది. స్పెషల్ బ్రాంచిలో పనిచేసే శేషగిరిని తిరుమల సీసీఎస్‌కు, చిత్తూరు రెండో పట్టణ సీఐ ఉలసయ్యను చిత్తూరు వీఆర్‌కు, డీసీఆర్‌బీలో ఉన్న బాలయ్యను వీఆర్‌కు, సీసీఎస్‌లో ఉన్న రామాంజినేయులును వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న సురేష్‌ను పుట్టపర్తి రూరల్ సర్కిల్‌కు ప్రభుత్వం బదిలీ చేసింది.


జేసీ శ్రీనివాసులు బదిలీ

- గుంటూరు కమిషనర్‌గా బాధ్యతలు
- కొత్త జేసీని కేటాయించని ప్రభుత్వం



చిత్తూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జేసీ పులి శ్రీనివాసులును గుంటూరు మున్సిపల్ కమిషనరుగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2017 కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారుల బ్యాచ్‌కు చెందిన ఈయన.. సర్వే సెటిల్మెంట్ అండ్ లాండ్ రికార్డ్స్ రాష్ట్ర విభాగంలో అడిషనల్ డైరెక్టరుగా పనిచేస్తూ బదిలీపై చిత్తూరు వచ్చారు. గతేడాది ఏప్రిల్ 15న జేసీగా బాధ్యతలు చేపట్టారు. గత ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఆర్వోగా వ్యవహరించారు. వైసీపీ వాళ్ల జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచి చిత్తూరులో బోగస్ ఓట్ల నమోదుకు ప్రయత్నిస్తే, అప్పటి కలెక్టర్ సహకారంతో ఈయన అడ్డుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక డీసీసీబీ, సీడీఎంఎస్, రెస్కోకు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుప్పం మిగులు భూములను త్వరగా క్లియర్ చేశారు. పుంగనూరు మండలం రాగానిపల్లెలో పెద్దిరెడ్డి మనుషులు తీసుకున్న 982 ఎకరాల్ని హోల్డ్ పెట్టే క్రమంలో సర్వే కమిషనర్ కోర్టులో రివిజన్ పిటిషన్ కూడా వేశారు. ఈయన గతంలో గుంటూరు మున్సిపాలిటీలో అడిషనల్ కమిషనరుగా, ఇన్‌చార్జి కమిషనరుగా మూడేళ్ల పాటు పనిచేశారు. ఇప్పుడు రెగ్యులర్ కమిషనర్‌గా వెళ్తున్నారు. కాగా, శ్రీనివాసులు స్థానంలో జిల్లాకు కొత్త జేసీని నియమించలేదు. రెండు మూడు రోజుల్లో కొత్త జేసీ వచ్చే అవకాశం ఉంది.

జెండా ఎగరేసేది మంత్రి సత్యకుమార్



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 9: స్వాతంత్ర్య దిన వేడుకలకు జిల్లా ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం ఆలస్యమవుతోంది.అందుకని స్వాతంత్ర్య దిన వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్‌ను నియమించింది. ఆగస్టు 15వ తేది ఉదయం 9 గంటలకు చిత్తూరులోని పోలీసు పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఎగురవేస్తారు. అనంతరం పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించి జిల్లా ప్రగతిని వివరించనున్నారు.

గిరిజన వసతి గృహంలో విజృంభిస్తున్న జ్వరాలు




ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు - చికిత్స పొందుతున్న మీర్జేపల్లె విద్యార్థి పద్మజ

పుంగనూరు, ఆగస్టు9: పుంగనూరులోని గిరిజన వసతి గృహంలో జ్వరాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల క్రితం ఓ విద్యార్థి డెంగ్యూ జ్వరంలో మృతి చెందగా ప్రస్తుతం నలుగురు విద్యార్థులు జ్వరాలతో ఇబ్బందులు పడుతూ పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. పదవ తరగతి చదువుతున్న దేవయాణి, వైష్ణవి, జ్యోతిలు రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ వసతి గృహం చుట్టూ పారిశుధ్యం లోపంతో దోమల కుట్టడం వల్ల తమకు జ్వరాలు సోకినట్లు వాపోయారు. సంబంధింత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్యం పనులు నిర్వహించి దోమల బారినుంచి కాపాడాలని విద్యార్థులు కోరుతున్నారు. అలాగే మండలంలోని వనమలదిన్నె పంచాయతీ మీర్జేపల్లెలో విషజ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య లోపంతోనే జ్వరాలు సోకినట్లు తెలిపారు. గ్రామంలోని గంగరాజు కుమార్తై పద్మజ(8), పద్మశ్రీలకు జ్వరాలు సోకి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పద్మజకు డెంగ్యూ జ్వరంగా డాక్టర్లు నిర్ధారించి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి పంపుతున్నట్లు వివరించారు. అధికారులు గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గుత్తార్లపల్లెలో చెరువు ఆక్రమిత భూమికి విముక్తి



బచ్చెని చెరువును వద్ద అక్రమదారులు



ఆక్రమిత భూమిలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న కందకాలు

గుడుపల్లె, ఆగస్టు 9: మండల పరిధిలోని గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లెకు చెందిన బచ్చెని చెరువు ఆక్రమిత భూమికి ప్రజల ఫిర్యాదుతో ఎట్టకేలకు శుక్రవారం విముక్తి లభించింది. గుత్తార్లపల్లెకు కిలోమీటర్ దూరంలో సర్వే నెంబరు 63లోని ఈ చెరువు విస్తీర్ణం 5.04 ఎకరాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. దశాబ్దకాలంగా చెరువు ఆక్రమణలకు గురై కొందరు పంటలు సాగు చేశారు. ఆక్రమణలు పోను మూడు ఎకరాలు మిగిలింది. ఈనెల 5వ తేదీన కుప్పం తహసీల్దార్ కార్యాలయంలో కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో గుత్తార్లపల్లెకు చెందిన బచ్చెని చెరువు ఆక్రమణల గురించి పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చెరువును సర్వే చేసి ట్రెంచ్ ఏర్పాటు చేయాలని కడా పీడీ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు చెరువు భూమిని సర్వే చేయడానికి శుక్రవారం బచ్చెని చెరువుకు చేరుకొన్నారు. ఆక్రమణదారులు సర్వేను అడ్డుకోవడానికి సిద్ధపడ్డారు. సర్వేకు అడ్డుతగిలితే కేసులు నమోదు చేసామని డీటీ కిరణ్‌కుమార్ నాయక్ హెచ్చరించారు. ఆక్రమణదారులు వెనకడుగు వేయడంతో సర్వేయర్ జయంత్, వీఆర్వో కుమార్, వీఆర్‌ఏలతో చెరువును సర్వే చేశారు. సుమారు 2 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు వారు గుర్తించారు. అనంతరం ఆక్రమిత చెరువు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో కందకాలు తవ్వించారు. ఎట్టకేలకు బచ్చెని చెరువు భూమి ఆక్రమణల నుంచి విముక్తి కలగడంతో గ్రామస్తులు సీఎం చంద్రబాబు పాలనపై గ్రామస్తులు ప్రశంసల వర్షం కురిపించారు.

రికవరీ ఇబ్బందులుంటే సహకరిస్తా : జేసీ



బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 9: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా అందించిన రుణాల రికవరీలో ఇబ్బందులుంటే రెవిన్యూ శాఖ తరఫున సహకారమందిస్తామని జేసీ, బ్యాంకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో డీసీసీబీ జిల్లా స్థాయి బ్రాంచ్ మేనేజర్ల సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఐదు శాతం ఉన్న రూ.100 కోట్ల నిరర్థక ఆస్తులను ప్రస్తుత వార్షిక సంవత్సరాంతంలోగా రెండు శాతానికి తగ్గించాలన్నారు. 2024-25లో బ్యాంకు రుణ పంపిణీ రూ.2,500 కోట్లుగా నిర్దేశించగా, గత నెలాఖరు వరకు రూ.2000 కోట్లు అందించిందని తెలిపారు. ఈ ఏడాది డిపాజిట్ల లక్ష్యం రూ.1,114 కోట్లు కాగా ఇంతవరకు రూ.908.46 కోట్లు సేకరించిందని, మరింత పెంచాలని సూచించారు. అక్టోబరు కల్లా 75 వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రికార్డులను కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. తొలుత బ్యాంకుకు విచ్చేసిన జేసీ శ్రీనివాసులుకు బ్యాంకు సీఈవో స్వాగతం పలికారు. బ్యాంకు జీఎంలు సి.శంకర్‌బాబు, లిల్లీకేథరిన్, డీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

మామిడి బోర్డును ఏర్పాటు చేయాలి

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, ఆగస్టు9: జాతీయ మామిడి బోర్డును ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. శుక్రవారం ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలకు హాజరైన ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తదితరులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం సమర్పించారు. తోతాపురి మామిడిని కనీస మద్దతు ధర జాబితాలో చేర్చాలని, సిండికేట్‌గా మారి మామిడి రైతులను దోచుకుంటున్న పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 9: జిల్లావ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 17 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా విజయపురంలో 25.2, అత్యల్పంగా బైరెడ్డిపల్లిలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది. గుడిపాల 18.0, వి.కోట 17.0, తవణంపల్లి 15.4, శ్రీరంగరాజపురం 14.4, పూతలపట్టు 12.4, చిత్తూరు 9.2, పాలసముద్రం 8.6, నగరి 7.8, సదుం 5.4, బంగారుపాళ్యం 5.4, గంగాధరనెల్లూరు 4.6, చిత్తూరు రూరల్ 3.6, యాదమరి 3.6, పలమనేరు 2.4, వెదురుకుప్పంలో 2.2 మి.మీ వర్షం కురిసింది.

సవరించిన మోటార్ వాహన చట్టంపై అవగాహన కల్పించాలి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 9: మోటారు వాహనం చట్టంలోని సెక్షన్-200ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జేసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జేసీ ఛాంబర్‌లో ఇందుకు సంబంధించి డిస్ట్రిక్ కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ తయారు చేసిన పోస్టర్‌ను నేషనల్ కన్స్యూమర్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ చదలవాడ హరిబాబుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ కేంద్రం సవరించిన మోటార్ వాహన చట్టంలోని నూతన నిబంధనలు కఠినంగా ఉన్నాయని, అతిక్రమించిన వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన



మహారాజపురంలో ఏపీఐఐసీ భూములను పరిశీలిస్తున్న అధికారులు

విజయపురం, ఆగస్టు 9: విజయపురం మండలం కోసలనగరం, మహారాజపురంలోని ఏపీఐఐసీ భూములను శుక్రవారం పరిశ్రమల శాఖ డైరెక్టర్ యువరాజు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌పరిశీలించారు. మండలంలో పరిశ్రమల స్థాపనకు అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు. ఐపీఐఐసీ భూములు సిద్ధంగా ఉండడంతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు మౌళిక సదుపాయాల వివరాలను తెలుసుకున్నారు. రైతులకు పరిహారం అందించే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అలాగే, మరో బ్లాకులో 470 ఎకరాలకు సంబంధించిన భూములను తీసుకోవడానికి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకట్‌రెడ్డి, ఏపీఐఐసీ జెడ్‌ఎం చంద్రశేఖర్, తహసీల్దార్ కిరణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

16న అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

తిరుచానూరు, ఆగస్టు 9: తిరుచానూరు పద్మావతీ దేవి ఆలయంలో 16వ తేదీ వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలోని ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నారు.వ్రతంలో పాల్గొనే గృహస్థులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, లడ్డూ, వడ ఇవ్వనున్నారు. వ్రతం కారణంగా శుక్రవారం ఆలయంలో ఆర్జితసేవలైన అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, వేదాశీర్వాదం, బ్రేక్ దర్శనం, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఘాట్ ప్రమాదంలో బస్సు డ్రైవర్ అరెస్ట్

తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌లోని చివరి మలుపు(తిరుమలకు జీఎన్సీ టోల్‌గేట్‌కు సమీపం ప్రాంతం)లో ఓ యువకుడు, యువతి బైక్‌పై ప్రయాణిస్తూ ముందు వెళుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వీరిద్దరూ తమిళనాడులోని పళ్లిపట్టు తాలూక వెలియాగరం గ్రామానికి చెందిన ఏఎస్ కార్తీక్(28), తిరువణ్ణామలై జిల్లాలోని చెంజాం తాలూక మషర్ గ్రామానికి చెందిన సౌమ్య(21)గా గుర్తించి మృతదేహాలను కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు. చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న వీరు ఒకరిని ఇష్టపడుతున్నట్టు తెలిసింది. వీరి ప్రేమ వ్యవహారం కుటుంబీకులకు కూడా తెలియదు. స్వామి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశంతో వచ్చి దుర్మరణం చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కాంతారావును అదుపులోకి తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. బస్సు డ్రైవర్‌దే తప్పని తేలడంతో అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇక ఏసీ బస్సు ముందు, వెనుకభాగంలో కెమెరాలున్నా స్విచ్ వేయలేదని అధికారులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ ఫుటేజ్ ఉంటే ప్రమాదం ఎలా జరిగింది, తప్పు ఎవరిదనే విషయాలు స్పష్టంగా అందరికీ తెలిసేవి.

కుప్పంలో సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రణాళికలు



కడా అధికారులతో చర్చలు జరుపుతున్న సాంకేతిక శాఖాధికారులు

కుప్పం, ఆగస్టు 9: నియోజకవర్గ పరిధిలో సాంకేతిక విద్యావకాశాలు మరింత పెంపొందించడానికి అవసరమయ్యే అభివృద్ధి ప్రణాళిక గురించి కడా కార్యాలయంలో అధికారుల బృందం శుక్రవారం చర్చలు జరిపింది. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం రీజియన్‌కు సంబంధించిన రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎ.నిర్మల్ కుమార్ ప్రియ, అసిస్టెంట్ డైరెక్టర్ బీజీ.వెంకటసుబ్బయ్య, డాక్టర్ జేమ్సియెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎం.జగన్నాథరావులు చర్చలో పాల్గొని సాంకేతిక విద్యాభివృద్ధికి తాము రూపొందించిన ప్రణాళికలను కడా అధికారులకు అందజేశారు. నూతన కోర్సులైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్ తదితర కోర్సులు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభిస్తే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగి, ఉపాధి ఉద్యోగావకాశాలు మెరుగుపడుతాయని ఈ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. నూతన కోర్సుల ప్రారంభానికి పరిశ్రమల సహకారం తీసుకోవాలని సూచించారు.





జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ అముద - చిన్నారుల నృత్య ప్రదర్శన

పిల్లలను బాగా చదివించండి

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి ● ఆదివాసీ దినోత్సవంలో డీఆర్వో పుల్లయ్య పిలుపు

చిత్తూరు, ఆగస్టు 9: గిరిజనులు తమ పిల్లలను చదివించడం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి చేరుతాయని డీఆర్వో పుల్లయ్య అన్నారు. చిత్తూరులోని డీఆర్‌డీఏ సమావేశపు హాలులో శుక్రవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. మేయర్ అముద, డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ.. మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటీష్‌వారిపై పోరాడటంలో గిరిజనుల పాత్ర కీలకమైందని గుర్తుచేశారు. గిరిజనులు సమాజానికి దూరంగా కొండల్లో, అడవుల్లో జీవిస్తుంటారని, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావడం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. గిరిజనులకు ఏవైనా సమస్యలుంటే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేయాలన సూచించారు. మూడు నెలలకు ఒకసారి జిల్లాస్థాయిలో నిర్వహించే డీవీఎంసీ సమావేశంలోనూ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. గిరిజనుల సమస్యలను ప్రస్తావించిన గిరిజన సంఘాల నాయకులు.. జిల్లా కేంద్రంలో గిరిజన భవనం కావాలని అధికారులను కోరారు. అనంతరం గిరిజన వయోవృద్ధులను అధికారులు సన్మానించారు. అంతకు ముందు గిరిజన సంప్రదాయ నృత్యాలు, డప్పులతో అలరించాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు చిరంజీవి, కృష్ణా నాయక్, మాలే గిరిధర్, మునీంద్ర నాయక్, జీవీ రమణ, ఆదినారాయణ, సుగుణమ్మ, డీవీఎంసీ సభ్యులు దేవరాజులు, రాజ్‌కుమార్, బాబు, మునస్వామి, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ భూ బాధితులతో కలసి ధర్నాలు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని జెండా వూపి పంపుతున్న నారాయణ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు9: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణల బాధితులను ఏకం చేసి వారికి న్యాయం చేయడానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విధానం భూబకాసురులకు వరంగా మారిందన్నారు. మదనపల్లెలో వున్న భూములకు పులివెందులలో రికార్డులు తారుమారుచేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయాన్ని ప్రశ్నించిన వేంకటేశ్వరరావుపై గత ప్రభుత్వం కేసులు బనాయించిన విషయాన్ని గుర్తుచేశారు.తప్పుడు రికార్డులతో రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారి భరతం పట్టడానికి భూబాధితులను ఏకంచేసి విశాఖపట్టణం నుంచి ఆందోళనలు ప్రారంభిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులను గ్రాంట్ రూపంలో కేటాయించాలన్నారు. కేంద్రప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించకుండా ఢిల్లీలో ఆందోళనలు చేయడం అర్థరహితమని మండిపడ్డారు. ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని గెలిపిస్తే, ఆయన ఆ ప్రజలకు దూరంగా ఢిల్లీ వెళ్ళి ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనని విమర్శించారు.బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఉద్యమాన్ని సీపీఐ సమర్థిస్తోందన్నారు.అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అందరూ సహకరించాలన్నారు. ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు విధానమే మంచిదన్నారు.వయనాడ్‌లో జరిగిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయవిపత్తుగా గుర్తించి జాతీయవిపత్తు నిధినుంచి నిధులు కేటాయించాలని కోరారు.అంతకుముందు వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని ఆయన జెండా వూపి ప్రారంభించారు.సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.హరినాథరెడ్డి, మురళి, పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో గరుడసేవ



తిరుమల క్షేత్రంలో శుక్రవారం రాత్రి గరుడవాహన సేవ కన్నులపండువగా జరిగింది. గరుడపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడిడిపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో శ్రీవారు ఊరేగారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి



రావి,వేప వృక్షాలకు కల్యాణం

ఎర్రావారిపాలెం మండలం కమ్మళ్ళ కూడలి సమీపంలోని రావి, వేప వృక్షాలకు శుక్రవారం ఉదయం కల్యాణం జరిపించారు.కమళ్ళయ్యగారిపల్లెకు చెందిన వాసు చాలా సంవత్సరాలుగా గ్రామస్తులతో కలిసి రావి, వేప చెట్లకు పెండ్లి జరిపిస్తున్నారు. ఈ క్రమంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఉదయం పురుషోత్తం, అరుణ దంపతులు వరుడి కుటుంబం(రావి) తరఫున, జయరామయ్య, గీత దంపతులు వధువు (వేప)కుటుంబం తరఫున పట్టు వస్త్రాలు ధరించి పెండ్లి పీటలపై ఆశీనులయ్యారు.వేదపండితులు సాయి వర్మ కళ్యాణ తంతు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులకు విందు భోజనం వడ్డించారు.

- ఎర్రావారిపాలెం

వరసిద్ధుడి సేవలో రాష్ట్ర చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్




శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈవో వెంకటేశు - దీపావెంకట్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి



వరసిద్ధుడి సేవలో సీసీఎల్‌ఏ జయలక్ష్మి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 9: రాష్ట్ర చీఫ్ కమిషనర్ ల్యాండ్(సీసీఎల్‌ఏ) జయలక్ష్మి కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ పునర్నిర్మాణ దాతలలో ఒకరైన గుత్తికొండ శ్రీనివాసులు, స్వర్ణ భారత్ ట్రస్టు చైర్మన్ దీపావెంకట్ స్వామిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

స్కావెంజర్ల జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 9: మాన్యువల్ జిల్లా స్కావెంజర్ల సర్వే జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కమిటీలో నలుగురు సభ్యులుంటారని, వారిలో మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అలాగే వారి కోసం పనిచేసే సంఘాల్లోని ఇద్దరు ప్రతినిధులు ఉంటారని తెలిపారు. ఈ నలుగురిలో ఒకరు మహిళా సభ్యులు ఉంటారని వివరించారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలతో ఈనెల 13వ తేదీలోపు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత కార్యాలయం, కలెక్టరేట్ ప్రాంగణం, చిత్తూరులో దరఖాస్తులను అందించాలని కోరారు. ఇతర వివరాలకు 9347739382ను సంప్రదించాలని కోరారు.

సోమల తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



సోమల, ఆగస్టు 9: సోమల తహసీల్దారుగా బెన్నురాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోలు, సిబ్బంది స్వాగతం పలికారు. డీటీ రమేశ్, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు సుబ్రమణ్యం, వీఆర్వోలతో సమావేశమై స్థానిక స్థితిగతులు తెలుసుకున్నారు. జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, బీజేపీ గన్నామదన్‌మోహన బాబు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కల్లూరు, ఆగస్టు 9: వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో శ్రీనివాస్ తెలిపారు. పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ వేరుశనగలో ఊడలు దిగే సమయంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఎకరాకు 200కేజీల జిప్సం వేయాలన్నారు. వేరుశనగ పంటలో పక్షి స్థావరాలు ఏర్పాటు చేస్తే పురుగుల బెడద తగ్గుతుందన్నారు. రైతుసేవాకేంద్రం అధికారి మంజుల, రైతులు పాల్గొన్నారు.

పులిచెర్ల తహసీల్దార్‌గా జయసింహ



కల్లూరు, ఆగస్టు 9: పులిచెర్ల తహసీల్దార్‌గా శుక్రవారం జయసింహ బాధ్యతలు చేపట్టారు. ఆయనను పూలమాల, దుశ్శాలువాతో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందికి మండల ప్రజలు సహకరించాలని తెలిపారు.

తల్లిపాలే పిల్లలకు ఆరోగ్యదాయకం

రొంపిచెర్ల, ఆగస్టు 9: తల్లిపాలు చిన్నపిల్లలకు ఆరోగ్యదాయకమని డాక్టరు వినయ్ చెప్పారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు పరీక్షలు చేశారు. రక్తహీనతను గుర్తించి మందులు ఇచ్చి పౌష్టికాహారం గురించి వివరించారు. సురక్షితమైన ప్రసవం కోసం ప్రభుత్వఆస్పత్రిలో కాన్పు చేయించుకోవాలన్నారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, ఈ పాలల్లో అధికంగా వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్‌ఎన్ పార్వతమ్మ, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తసేకరణ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

రొంపిచెర్ల, ఆగస్టు9: మండలంలోని చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఏపీఎస్ఐఆర్‌డీ రాష్ట్ర అబ్జర్వరు ప్రసాద్ సూచించారు. శుక్రవారం రొంపిచెర్లలో జీపీపీఎస్‌లను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల విధి విధానాలపై జరుగుతున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని తగిన సూచనలు సలహాలు సర్పంచులకు, కార్యదర్శులకు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, ఈవోపీఆర్‌డీ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఆగస్టు9: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలి శ్రావణ శుక్రవారం కావడంతో అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేపాకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

12న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

పుంగనూరు రూరల్, ఆగస్టు9: ఈనెల 12న చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి మోహన్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో చంద్రశేఖరొరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్ డబ్బులు తెలుసుకోవడానికి ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. దీనిపై కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘనాయకులు శ్రీదర్, బుడ్డన్న, వెంకటప్ప, శ్రీరాములురెడ్డి, అంజప్ప, తులసీదాస్, మునిశేఖర్ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచే స్వాతంత్ర దినోత్సవాలు

పుంగనూరు, ఆగస్టు9: ఈనెల 13వ తేదీ నుంచి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు పట్టణ ప్రముఖులు తెలిపారు. శక్రవారం పట్టణంలోని లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, మానవాత సేవ సంస్థ, క్షత్రియసంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీకృష్ణాదేవరాయ సంఘం, అమ్మఅన్నదాన కమిటీ, వివేకానంద యువజన సంఘం, భవన కార్మికులు, మాజీ సైనికుల సంఘం, హిందూ దివ్యజ్ఞానజ్యోతి, అబ్దుల్‌కలామ్ అసోసియేషన్ తదితర సంస్థల సభ్యుల సమావేశం నిర్వహించారు. దీనిపై ఈనెల 12న 10గంటలకు పురవీధుల్లో స్కూటర్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ర్యాలీలో పట్టణ ప్రముఖులు, విద్యార్థులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

పలమనేరు, ఆగస్టు9 : గ్రామాల్లో పారిశుధ్యంపై సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రాజేష్, ఈవోఆర్‌డీ బాలరాజురాథోడ్ సూచించారు. పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పునశ్చరణ తరగతుల్లో శుక్రవారం వారు పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేయాలని, తద్వారా గ్రామాల్లో పరిశుభ్రత నెలకొనడంతోపాటు సంపద కేంద్రాల లక్ష్యం కూడా నెరవేరుతుందన్నారు. అనంతరం కూర్మాయి సంపద కేంద్రాన్ని సందర్శించి అక్కడ తయారు చేస్తున్న ఎరువులపై అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు సరికాదు

కుప్పం, ఆగస్టు 9: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టేందుకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు సరికావని ఆపస్ ప్రతినిధులు అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్న సర్దుబాటు ప్రక్రియను నిరసిస్తూ వారు శుక్రవారం డీఈవో దేవరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆపస్ ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం సరికాదన్నారు. 117 జీవోను రద్దు చేసి ఉన్నత పాఠశాలలనుంచి 3, 4 తరగతులను ఉపసంహరించి ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని కోరారు. అలాగే పదోన్నతులు చేపట్టిన తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను వేర్వేరుగా పరిగణిస్తూ ఉపాధ్యాయులను కేటాయించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 10 కన్నా ఎక్కువ ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థుల సంఖ్యను అనుసరించి కేటగిరీల వారిగా 80 దాటితే 20 మందిని నియమించాలని అనేక డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ వినతులను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని ఆపస్ ప్రతినిధులు డీఈవోను కోరారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

పలమనేరు, ఆగస్టు 9: బంగ్లాదేశ్‌లో అక్కడి హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పలమనేరులో హిందూ సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై టవర్‌క్లాక్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి హిందువులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. పట్టణ బీజేపీ కన్వీనర్ తాతయ్యనాయుడు, హిందూ సంఘాల నేతలు సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లె, ఆగస్టు 9 : బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేసుకుని రక్తహీనత నివారణకోసం పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు చేసుకోవాలని వివరించారు. వ్యక్తిగత శుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత, సీజనల్‌వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగే తీర్థం పీహెచ్‌సీలో డాక్టర్ పద్మావతి గర్భిణులు ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కడపనత్తం మాజీ సర్పంచ్ మృతికి నివాళి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 9 : కడపనత్తం మాజీ సర్పంచ్ ధనలక్ష్మమ్మ గురువారం రాత్రి స్వగ్రామం తిరుమలనాయనికుప్పంలో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతిపట్ల పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. వారి కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పాలేటమ్మ ఊరేగింపు



సోమల, ఆగస్టు 9: మండలంలోని నెల్లిమంద పాలేటమ్మ జాతర సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని శుక్రవారం సోమల, చిన్న సోమలలో ఊరేగించారు. పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి, పోతురాజుకు ఇంటింటా మహిళలు కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు. శనివారం అమ్మవారు ఆలయానికి చేరుకునే క్రమంలో సిద్ధపూజలకు ఏర్పాట్లు చేపట్టారు. పలు గ్రామాల నుంచి చాందినీ బండ్లు ఆలయం వద్దకు ఆదివారం రాత్రి చేరుకునే క్రమంలో ధర్మకర్త నరసింహులు ఆలయ పరిసరాలను శుభ్రం చేయించి, విద్యుత్ అలంకరణకు శ్రీకారం చుట్టారు. ఆదివారం, సోమవారం జాతర ఘనంగా జరగనుంది.

లక్ష్మీనరసింహుడికి శ్రావణ పూజలు

కల్లూరు, ఆగస్టు 9: పులిచెర్ల మండలం దేవళంపేటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధరకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఉభయదారులుగా కల్లూరుకు చెందిన జ్యోతిప్రకాష్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు.

హెల్మెట్ తప్పనిసరి

కల్లూరు, ఆగస్టు 9: బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. కల్లూరులోని జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల తనిఖీచేశారు. వాహనదారులను ఉద్దేశించి ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. హెల్మెట్లు ధరించని వారిపై జరిమానాలు విధిస్తామన్నారు. రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

రొంపిచెర్ల, ఆగస్టు9: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీనివాసులు, వీఏఏ వెంకట్రమణనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బోడిపాటివారిపల్లె పంచాయతీలో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టారు.

రాత్రి డ్యూటీలు మినహాయించాలి

రొంపిచెర్ల, ఆగస్టు9: గ్రామ రెవెన్యూ సహాయకులకు నిబంధనలకు విరుద్ధంగా వేసిన రాత్రి డ్యూటీలు మినహాయించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు యామల లక్ష్మణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్‌అలీ శుక్రవారం కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చారు. రొంపిచెర్లలో ఇర్ఫాన్‌అలీ మాట్లాడుతూ గత నెల 23న సీసీఎల్ఏ వీఆర్ఏ జాబ్ చార్ట్ నిబంధనలకు విరుద్ధంగా వాచ్‌మన్ డ్యూటీ చేయాలని కార్యాలయం సర్క్యులర్ జారీ చేశారన్నారు. నెలకు కేవలం రూ.11000 మాత్రమే జీతం తీసుకుంటూ చితకిపోతున్నామన్నారు. అదనంగా అప్పజెప్పిన వాచ్‌మెన్ డ్యూటీలు రద్దుచేసి ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, అటెండర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను సీనియార్టీ పద్ధతిలో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమారి, వై.మంజుల పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు పాటించాలి

సోమల, ఆగస్టు 9: ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించి విద్యార్థులను ఆకట్టుకోవాలని ఎంఈవో శివతర్న తెలిపారు. శుక్రవారం ఆమె పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. నెల్లిమంద, తురకపల్లె, కందూరు పాఠశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వి.కోట అర్బన్ సీఐగా సోమశేఖర్‌రెడ్డి



వి.కోట, ఆగస్టు 9: వి.కోట అర్బన్ సీఐగా సోమశేఖర్ రెడ్డి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ లింగప్పను చిత్తూరు వీఆర్‌కు అటాచ్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో చిత్తూరు జిల్లాలో ఎస్ఐగా పనిచేసిన సోమశేఖర్‌రెడ్డి పదోన్నతిపై కర్నూల్ జిల్లాకు వెళ్లారు. ఇటీవల సాధారణ బదిలీల్లో ఆయనకు వి.కోట కేటాయించారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం



పుంగనూరు రూరల్, ఆగస్టు9: స్థానిక మాణిక్య వరదరాజస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప భక్తులకు అన్నదానం ప్రారంభించినట్లు నిర్వహకులు తెలిపారు. యేటా దాతల సహకారంతో 41రోజులపాటు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం భక్తులు వచ్చి భోజనాలు చేయవచ్చునన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఆగస్టు 9: పుంగనూరు పట్టణంలోని కోనేటిపాళ్యానికి చెందిన నాగప్ప కుమారుడు ప్రకాశ్(42) కుటుంబ కలహాల కారణంగా ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమించడంతో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో టీడీపీ నేత మృతి

వి.కోట, ఆగస్టు 9: ఓగు పంచాయతీ ఆళ్వారిపల్లెకు చెందిన శంకర్‌రెడ్డి (46) గుండెపోటుతో మృతి చెందారు. గురువారం అర్ధరాత్రి దాటాక అతను అస్వస్థతకు గురికావడంతో అతనిని కుటుంబ సభ్యులు కోలార్ నారాయణ హృదయాలయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. శంకర్‌రెడ్డి టీడీపీ సీనియర్ నేతగా, మండల రైతు విభాగం కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే ఎన్.అమరనాథ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, నేతలు రాంబాబు, చౌడప్ప, ధీరజ్, శబరీష్ తదితరులు ఆ గ్రామానికి చేరుకుని శంకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్‌టీపీ నిర్మాణం కోసం స్థల పరిశీలన



ఎస్‌టీపీ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తహసీల్దార్ ఇన్బనాథన్ తదితరులు

పలమనేరు, ఆగస్టు9 : పలమనేరులో మురుగునీటిని శుద్ధిచేసే ప్లాంట్ నిర్మాణానికి (సెవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఎస్‌టీపీ) అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. పట్టణంలోని మురుగునీరు ప్రస్తుతం పట్టణానికి ఆనుకొని ఉన్న పెద్దచెరువులో కలుస్తోంది. కొన్ని దశాబ్దాలుగా మురుగునీరు పెద్దచెరువులో కలిసి పోవడం వలన భూగర్భజలాలు కలుషితమైపోయాయి. పంటలు కలుషిత నీటితో పండక పోవడంతో రైతులు ఆయకట్టు సాగుకు స్వస్తిపలికారు. మురుగునీటిని పెద్దచెరువులో కలియకుండా చేసి ఆ నీటిని శుద్ధి చేసి పంటలకు వినియోగించుకోవడం లేదా చెరువులకు మళ్లిస్తే ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్య పరిష్కరించవచ్చు. ఎన్నో ఏళ్లుగా మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ పై ప్రతిపాదనలు ఉన్నా కార్యరూపం మాత్రం దాల్చలేదు. ఈనేపథ్యంలో శుక్రవారం పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి, తహసీల్దార్, మున్సిపల్ ఇంజినీర్ రూపేష్ ఎస్‌టీపీ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు.

ఇళ్ల స్థలాల కోసం ...

కుప్పం, ఆగస్టు 9: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 7వ వార్డు వడ్డెపల్లె గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి అనువైన స్థలం కోసం శుక్రవారం టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలన జరిపారు. వడ్డెపల్లె పరిసరాలలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ, డీకేటీ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ పేదలైన వడ్డిపల్లె వాసులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు త్వరలోనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవి, యూనిట్ ఇన్‌చార్జి మాణిక్యం, వడ్డిపల్లె వాసులు పాల్గొన్నారు.



స్థలాలను పరిశీలిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

ఘనంగా నాగపంచమి పూజలు



నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు, నాగలరాళ్లకు పూజలు చేస్తున్న మహిళలు

రామకుప్పం, ఆగస్టు 9: రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం నాగపంచమి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని అర్చనలు చేయించారు. స్వామి దర్శనానికి ముందు భక్తులు ఆలయ ఈశాన్య దిక్కున గల నాగులపుట్టకు, నాగదేవత విగ్రహాలకు పూజలు చేశారు. పుట్టలో పాలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

పుంగనూరు రూరల్ : స్థానిక కోనేటి వద్ద గల కాశీవిశ్వేశ్వరస్వామి ఆవరణలో వెలసిన నాగదేవతలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నాగదేవతలకు పాలు పోసి చలిపిండి పెట్టి, మొక్కులు చెల్లించారు.

సహజ నైపుణ్యం ఆదివాసీల లక్షణం

కుప్పం, ఆగస్టు 9 : ఆదివాసీలు ఈ భూమిమీద ఆదిలో జన్మించిన జాతి అని, సహజ నైపుణ్యం కలిగి ఉండడం వారి నైజమని కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో శుక్రవారం జరిగిన ఆదివాసీల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శౌర్యం, సహజ నైపుణ్యాలు కలిగి దట్టమైన అడవుల్లో సైతం చాలా పరిమిత వనరులతో ప్రశాంత జీవనం సాగించగలగడం ఆదివాసీలకే సాధ్యమన్నారు. ఇప్పుడు వారు ఆధునిక సమాజంలో ఏ నైపుణ్యాన్నైనా అతి తక్కువ సమయంలో సాధించి, ఉన్నత స్థాయికి చేరగల శక్తిమంతులుగా మారారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీల సంఘం నాయకులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం

మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

డీఎస్పీ రఘువీర్ విష్ణు

గంగవరం, ఆగష్టు 9 : ఆకతాయిలతో స్నేహం చేసి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ రఘువీర్ విష్ణు హెచ్చరించారు. శుక్రవారం మదర్‌థెరిసా కళాశాలలో పొగాకు వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది జీవితంలో చాలా ముఖ్యమైన ఘట్టమన్నారు. విద్యార్థి దశలో నేర్చుకొనే అలవాట్లు, జ్ఞానం జీవితాంతం తోడుగా ఉంటాయనడంలో సందేహం లేదన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువుకొని రాణించినట్లయితే అనుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను సులభంగా అధిరోహించవచ్చన్నారు. అనంతరం పొగాకు, మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు డీఎస్పీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీఐ చిన్నగోవిందు, కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదన్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

త్రీడీ రూపంలో మహేశ్‌బాబు



కుప్పం, ఆగస్టు 9: సినీ హీరో మహేశ్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కుప్పానికి చెందిన పురుషోత్తం (పూరి ఆర్ట్స్) హీరో చిత్రపటాన్ని త్రీ డీ రూపంలో రూపొందించారు. నేరుగా చూస్తే మహేశ్‌బాబు, నీటిలో ప్రతిబింబం చూస్తూ ఆయన తండ్రి సూపర్ స్టార్ కృష్ణ చిత్రాలు కనిపించేలా రూపొందించిన ఈ పెయింటింగ్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది.

పలమనేరులో...



అన్నదాన కార్యక్రమం

పలమనేరు, ఆగస్టు 9: పలమనేరులో శుక్రవారం సినీనటుడు మహేష్‌బాబు 49వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు.పలమనేరు పద్మశ్రీ థియేటర్ వారు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహేష్‌బాబు అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్టీసీ రమణ, పట్టణ కన్వీనర్ దత్తాత్రేయ ప్రెసిడెంట్ అర్షాద్, కార్యదర్శి యశ్వంత్ , కోశాధికారి హరీష్, అభిమానులు మణిబాబు, చరణ్, సమీర్, ఎస్. అర్షాద్, తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల నివారణకు ప్రత్యేక టీం

సోమల, ఆగస్టు 9: అంటువ్యాధుల నివారణ కోసం ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం చిన్నఉప్పరపల్లె పంచాయతీలోని ఇర్లపల్లె, గురికానివారిపల్లెలో వైద్య బృందం పర్యటించి మురికినీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో మలాతియన్ స్ప్రే చేయించారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. కార్యక్రమంలో సోమల వైద్యాధికారి జయసింహ, సీహెచ్‌వో అమరనాథ్, కార్యదర్శి జయశంకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం అమానుషం

పలమనేరు, ఆగస్టు9 : విజయవాడలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై చేసిన దాడిని పలమనేరులో వైసీపీ నాయకులు ఖండించారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో వారు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ పై దాడి అమానుషమని, ఈ దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ప్రహ్లద, మున్సిపల్ కౌన్సిలర్ శ్యాంసుందర్‌రాజ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి షూటింగ్ బాల్ పోటీలు

వి.కోట, ఆగస్టు 9: వి.కోటలో ఈ నెల 10, 11 తేదీల్లో అంతర్ జిల్లా షూటింగ్‌బాల్ 7వ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ లయన్ మహేష్ తెలిపారు. బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు. 10న ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి చేతుల మీదుగా పోటీలను ప్రారంభించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, కార్యదర్శి వేణుగోపాల్ వివరించారు. ఈ పోటీలకు బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని తీర్చిదిద్దారు. క్రీడాకారులకు బాలుర, బాలికల పాఠశాలల్లో బస ఏర్పాట్లు చేశారు.

గంగమ్మకు విశేష పూజలు

సోమల, ఆగస్టు 9: స్థానిక బోయకొండ గంగమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష అలంకరణలు జరిపి అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే స్వయంభేశ్వరిస్వామి ఆలయంలో ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకపూజలు జరిపారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేద్దాం

సోమల, ఆగస్టు 9: ఎస్సీ వర్గీకరణ విజయంతో ఈనెల 13న ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న కృష్ణమంద మాదిగకు ఘనస్వాగతం పలికేందుకు మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళి తెలిపారు. పెద్దఉప్పరపల్లె, కందూరు, నంజంపేట గ్రామాల్లో చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతానికి సమావేశాలు నిర్వహించారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కుప్పం, ఆగస్టు 9: కుప్పం మండలంలో గల 33/కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలలో మరమ్మతుల కారణంగా ఆదివారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని రెస్కో ఎండీ సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం పురపాలక సంఘంతోపాటు కుప్పం రూరల్ మండల పరిధిలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆలయాల్లో ఘనంగా నాగపంచమి


పుట్టకు పాలు పోస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నగర వాసులు నాగపంచమి పండుగను ఘనంగా నిర్వహించారు. ఇళ్లముందు మామిడి తోరణాలు కట్టి నాగదేవతకు పూజలు చేశారు. గిరింపేట దుర్గాంబ, శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, సంతపేట కనకదుర్గ, నాగాలమ్మ, 75 దొడ్డిపల్లె సప్తకన్నికల, కట్టమంచి కులందేశ్వర, ఇరువారం నాగేంద్ర స్వామి, కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వర, గాయత్రినగర్ కాలనీ ఓంశక్తి ఆలయాల్లో నాగదేవతలకు పూజలు చేశారు. పుట్టలకు పాలు, గుడ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆడిమాస శుక్రవార పూజలు


అంకాల పరమేశ్వరికి లక్షదీపార్చన

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9: నగరంలోని తమిళవాసులు నాల్గవ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారికి మహాభిషేకం నిర్వహించి, విశేష పుష్పాలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం లక్షదీపార్చన చేశారు. సంతపేట నాగాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో దీపారాధన చేశారు.

రేపు అంకాల పరమేశ్వరికి పాలాభిషేకం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9: గుర్రప్ప నాయుడువీధి అంకాల పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం ఉదయం పాలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బి.కె.కుమార్ తెలిపారు. కట్టమంచి సంపద వినాయక ఆలయం నుంచి భక్తులు పాలబిందెలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి స్వహస్తాలతో అభిషేకం చేస్తారని పేర్కొన్నారు.

12న పచ్చయమ్మన్ కల్యాణం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9: నగర పరిధిలోని 75 దొడిపల్లె శ్రీమన్నారు స్వామి సమేత పచ్చయమ్మన్ అమ్మవారికి 12వ తేదీన కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తిరుకుమరన్ తెలిపారు. అన్నదానం ఉంటుందని, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఆహార నియంత్రణతోనే ఆరోగ్యం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 9: కౌమార దశలో విద్యార్థినులు ఆహార నియంత్రణతో ఆరోగ్యంగా ఉండగలరని డాక్టర్ తులసిప్రియ చెప్పారు. శుక్రవారం స్థానిక సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో అమ్మ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ, శారీరక వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉండగలరని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మనోహర్, ట్రస్టు ఫౌండర్ వినోద్‌కుమార్, డైరెక్టర్ అభినవశంకర్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు వేగవంతం చేయండి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 9: ఓపెన్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని స్టేట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ ఆదేశించారు. శుక్రవారం డీఈవో సమావేశ మందిరంలో ఏడీ వెంకటేశ్వర రావు అధ్యక్షతన ఓపెన్ స్కూల్ సెంటర్ల కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈనెల 27 నాటికి అడ్మిషన్ల ప్రక్రియ ముగియనున్న క్రమంలో లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

గుడిపాల, ఆగస్టు 9: మండలంలో రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తెలుగు యువత ఉపాధ్యక్షుడు హేమాద్రి నాయుడు ఆయన వెంట ఉన్నారు.

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన



గుడిపాల, ఆగస్టు 9: గుడిపాలలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు శుక్రవారం జీజేఎం ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నేతలు హేమాద్రి నాయుడు, మురళీనాయుడు స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం పక్కనే స్థలాన్ని ఎంపిక చేసి, జేసీబీతో చదును చేశారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

డీఐవో ఆకస్మిక తనిఖీలు

గుడిపాల, ఆగస్టు 9: గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఐవో హనుమంతరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ, డెలివరీ రూమ్, వ్యాక్సినేషన్ గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కాన్పులు ప్రభుత్వాస్పత్రుల్లోనే అయ్యేలా చూడాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రతపై ఆరా తీశారు. వైద్యాధికారి డాక్టర్ సంధ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా తిరునాళ్ల

గుడిపాల, ఆగస్టు 9: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆడినెలా సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్రాళ్లమిట్ట సప్తకన్నికలమ్మకు కరణం కులస్తులు పూజలు చేశారు. చిత్తపారలో రాజరాజేశ్వరమ్మకు పాలాభిషేకం, పానాటూరులో ముత్యాలీశ్వరమ్మ ప్రత్యేక పూజలు చేశారు. ముట్టుకూరుపల్లెలో సత్యమ్మకు ప్రత్యేక అభిషేకం, పూజలు చేసి అంబళ్లు పోశారు. జీజేఎం ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నేత హేమాద్రినాయుడు, రాష్ట్ర కరణం సంఘ కార్యదర్శి నిరంజన్‌బాబు, రమేష్ పాల్గొన్నారు.

108లో ప్రసవం



గుడిపాల, ఆగస్టు 9: చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాళ్యానికి చెందిన ప్రియ 108లో ప్రసవించింది. గురువారం అర్ధరాత్రి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సిబ్బంది ఆమెను చిత్తూరు ఆస్పత్రికి తీసుకొస్తుండగా ఉయ్యాలచింత వద్ద మగబిడ్డకు జన్మనిచ్చింది.

14న గుడిపాల మండల మీట్

గుడిపాల, ఆగస్టు 9: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉపేంద్ర తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

అమరావతికి రూ.10వేల విరాళం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 9: రాజధాని అమరావతి నిర్మాణానికి గంగాధరనెల్లూరు మండలానికి చెందిన ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగులు, ఓ కుదువ వ్యాపారి కలిసి రూ.10వేలు విరాళాన్ని ప్రభుత్వానికి శుక్రవారం పంపించారు. మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఐ.కన్నయ్యనాయుడు రూ.5వేలు, రిటైర్డ్ టీచర్లు యుగంధర్‌పిళ్లై రూ.2వేలు, ఎం.దామోదర్‌రెడ్డి వెయ్యి రూపాయలు, కుదువ వ్యాపారి రవికుమార్ రూ.2వేలు సేకరించుకుని బ్యాంక్‌లో డీడీ తీసి పోస్ట్‌ద్వారా ప్రభుత్వానికి పంపించారు.

విద్యా సామగ్రి పంపిణీ



గంగాధరనెల్లూరు, ఆగస్టు 9: సినీ హీరో మహేష్‌బాబు పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం ఆయన అభిమాన సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు లోకనాథం మండలంలోని అక్కనగారి పల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. హెచ్‌ఎం గంగాధరం, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు మోహన్, మొగిలయ్య, వినాయకం, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ పూజ, అంగన్‌వాడీ టీచర్ సరిత పాల్గొన్నారు.

ఎంపీడీవోల బదిలీ

వెదురుకుప్పం, ఆగస్టు 9: వెదురుకుప్పం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న పి.వరప్రసాద్‌ను, కార్వేటినగరం ఎంపీడీవో కేవీ శ్రీధర్‌నాయుడిని వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు త్వరగా బాధ్యతలు స్వీకరించాలని పేర్కొంది.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

13న జాబ్‌మేళా

చిత్తూరు రూరల్, జూలై 11: నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 13వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, కరూర్ వైశ్య బ్యాంకు, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీలలో పలు పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలు లోపు వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో రావాలని కోరారు.

వైభవంగా అలుగుకుండల ఉత్సవం



నగరి ఆగస్టు9 : చింతలపట్టెడలోని ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో శుక్రవారం అలుగు కుండల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ ఆధ్వర్యంలో పసుపు వస్త్రాలు ధరించిన భక్తులు అలుగు కుండలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా చేరుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారికి తాళిబొట్టు వితరణ



వెదురుకుప్పం, ఆగస్టు 9: చవటగుంట ద్రౌపదీ అమ్మవారికి పెరుమాళ్లపల్లెకు చెందిన టి.రాధాకృష్ణ, జీవన్ సాయి దంపతుల వితరణతో తాళిబొట్టు అందజేశారు. దాని విలువ రూ.14500 అని ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. బలిజమొండి వెంగనపల్లెకు చెందిన పోటుగారి సుమతి ఉభయదారుగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్య క్రమాలు చేయించారు.

కొత్తపల్లె స్కూల్ చైర్మన్‌గా ప్రహ్లాదన్

శ్రీరంగరాజపురం, ఆగస్టు 9: 49 కొత్తపల్లెమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా జి.ప్రహ్లాదన్, వైస్ చైర్మన్‌గా పి.యమున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఎన్నిక జరిగినా కొన్ని అనివార్య కారణాల వల్ల ఫలితాన్ని ప్రకటించలేదు. శుక్రవారం మళ్లీ ఎన్నిక నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్లను ప్రకటించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఎంఈవో సబర్మతి, హెచ్‌ఎం శాంతి, టీడీపీ నాయకులు దాసరి జీవన్‌కుమార్, సూరిరెడ్డి, గురునాథం, దాసరి సతీష్, యోగి నాయుడు, లోకనాథంరెడ్డి, శేఖర్, హర్షవర్ధన్‌రెడ్డి వారిని సన్మానించారు.

వావిలాకు కషాయంపై అవగాహన

వెదురుకుప్పం, ఆగస్టు 9: రైతులకు వావిలాకు కషాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. మొండివెంగనపల్లెలో రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులను పొలం బడి కార్యక్రమంలో చెప్పారు. లద్దె పురుగుల నివారణకు వావిలాకు కషాయం తయారీ గురించి వివరించి, పిచికారీ చేశారు. డ్రిప్ స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. పొలం బడి కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు డి.ఉమ, మండల వ్యవసాయాధికారిణి సి.వనిత పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక దృఢత్వానికి క్లబ్‌ల ఏర్పాటు


మాట్లాడుతున్న డీన్ వినోద్ భట్

చిత్తూరు రూరల్, ఆగస్టు 9: విద్యార్థుల మానసిక దృఢత్వానికి క్లబ్‌లు ఉపయోగపడతాయని అపోలో వైద్య కళాశాల ప్రొఫెసర్ వినోద్ భట్ తెలిపారు. శుక్రవారం స్థానిక అపోలో యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన క్లబ్ విధివిధానాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కో క్లబ్ వల్ల ఒక్కో అంశంపై అవగాహన పెంచుకోవచ్చునన్నారు. వ్యాయామం, యోగా, ఫొటోగ్రఫీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ క్లబ్‌ల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని పేర్కొన్నారు. అనంతరం వివిధ క్లబ్బుల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పేదలకు ఆహారం పంపిణీ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం మాస నారాయణ సేవను ఘనంగా నిర్వహించారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు చేసి, భజనలు నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి, చర్చివీధి, గాంధీవిగ్రహం సెంటర్, లెప్రసీ కాలనీల్లో పేదలకు ఆహార, తాగునీటి పొట్లాలు అందజేశారు.

దుకాణాల వేలంతో రూ.21,700 రాబడి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9: స్థానిక చర్చివీధిలోని జీవ కారుణ్య అన్నదాన సమాజం వాణిజ్య సముదాయంలోని దుకాణాలకు ఈవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. ఆరు దుకాణాలకు మూడు సంవత్సరాల అద్దె ప్రాతిపదికన ఒక్కో దుకాణానికి అడ్వాన్స్ రీఫండబుల్ రూ.లక్ష చొప్పున రూ.6 లక్షలు, నెలసరి అద్దె చొప్పున రూ.21,700 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. మిగిలిన మూడు దుకాణాలకు త్వరలోనే వేలం పాటలు నిర్వహిస్తామని తెలిపారు.

జోరుగా పారిశుధ్య పనులు



బంగారుపాళ్యం, ఆగస్టు 9: మండలంలోని జంబువారిపల్లి పంచాయతీ చెంగల్రాయనాయుడు కాల్వలో శుక్రవారం సర్పంచ్ అమర, వైస్ సర్పంచ్ కమల్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువలో మురుగునీరు, వాటర్ బాటిళ్లు, చెత్త పేరుకుపోయింది. ఎక్స్‌కవేటర్‌తో శుభ్రపరిచారు. జాతీయ రహదారి పక్కన, ప్రభుత్వాస్పత్రి వద్ద చెత్తను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 9: ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని విద్యారంగంలో నూతన ఒరవడి సృష్టించడంలో స్థానిక విజయం విద్యా సంస్థలు ముందంజలో ఉన్నాయని, దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థులకు కళాశాలల అధినేత తేజోమూర్తి అధ్యక్షతన ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఎస్వీయూ రిజిస్ట్రార్ డాక్టర్ భూపతినాయుడు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ప్రపంచంలో విస్తరిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కొత్త కోర్సుల్లో ప్రవేశం పొందడం ద్వారా భవిష్యత్తును స్థిరపరచుకోవచ్చన్నారు. విజయం విద్యా సంస్థలు డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ శైలజామూర్తి, ప్రిన్సిపాల్ గోపి, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించండి


పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు రూరల్, ఆగస్టు 9: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ మణికంఠ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్ పేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, పెండింగ్ కేసులను పరిశీలించారు. చోరీలు, అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవల్లో అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి, బైండోవర్ చేయాలని తెలిపారు. అనంతరం స్టేషన్‌లో కలియతిరిగి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తాలూకా సీఐ శ్రీనివాసరావు, ఎన్ఆర్ పేట ఎస్ఐ సుబ్బమ్మ ఉన్నారు.

గుండెపోటుతో కలిజవేడు వీఆర్వో మృతి


గుణశేఖర్ (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, ఆగస్టు 9: మండలంలోని వీరకనెల్లూరు దళితవాడకు చెందిన కలిజవేడు వీఆర్వో గుణశేఖర్ శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. వీరకనెల్లూరు దళితవాడలోని తన ఇంట్లో గురువారం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు ఎంత లేపినా చలనం లేకుండా ఉండడంతో కేకలు పెట్టారు. చుట్టుపక్కల వారు వెళ్లి పరిశీలించగా అప్పటికే శ్వాస ఆడలేదు. గుండెపోటుతో మరణించి ఉంటాడని నిర్ధారించుకున్నారు. గుణశేఖర్ భౌతికకాయానికి వివిధ పార్టీల నేతలు, వీఆర్ఏలు, వీఆర్వోలు, సర్వేయర్లు, కలిజవేడు సచివాలయ ఉద్యోగులు, ఆర్ఐ దేవి, తహసీల్దార్ చంద్రశేఖర్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. శనివారం వీరకనెల్లూరు దళితవాడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్ రావు

పూతలపట్టు, ఆగస్టు 9: ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వేము ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు కోరారు. శుక్రవారం వేము ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మొదటి సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డలను గారాబంగా పెంచి, వారి భవిష్యత్తును నాశనం చేయరాదన్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలంటే సత్ప్రవర్తన నేర్పాలన్నారు. తల్లిదండ్రులు పడే కష్టాలను విద్యార్థులు గుర్తించి బాగా చదువుకుని మంచిపేరు తెచ్చిపెట్టాలన్నారు. అనంతరం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రొఫెసర్ సుదర్శన్‌రావు సూచనలు, సలహాలు ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి, డాక్టర్ మణిలాల్, బీటెక్ హెడ్ శశికళ, డాక్టర్ సాయిశిరీష పాల్గొన్నారు.

మహారాజపురంలో తమిళనాడువాసి మృతి

విజయపురం, ఆగస్టు 9: మండలంలోని మహారాజపురం సమీపంలో తమిళనాడు వాసి భాస్కరన్(53) మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు తిరువళ్లూరు జిల్లా, తామరపాకానికి చెందిన భాస్కరన్ విద్యుత్ శాఖలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం భార్య ఉష సొంతూరు కావేరిరాజపురానికి వెళ్లాడు. కనకమ్మసత్రం వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన భాస్కరన్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయడం మొదలుపెట్టారు. మహారాజపురం మద్యం షాపు వెనుక మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయప్ప కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్, ఆగస్టు 9: చిత్తూరు అర్బన్, పాలసముద్రం, గుడిపాల మండల పరిసరాల్లో 33 కేవీ, 11 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరంలోని ఎంఎస్ఆర్ కూడలి, రాజీవ్‌గాంధీ వీధి, కొండమిట్ట, లాలూగార్డెన్, మిట్టూరు, నాయుడు బిల్డింగ్స్, సీబీ రోడ్డు, సంతపేట, తోటపాళ్యం, సవటపల్లి, ఇందిరానగర్, కైలాసపురం, మున్సిపల్ కాలనీ, దుర్గమ్మగుడి వీధి, బాలాజీ నగర్, కొంగారెడ్డిపల్లి, కట్టమంచి, ఎస్టేట్, ఆర్టీసీ బస్టాండ్, బీవీరెడ్డి కాలనీల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. చిత్తూరు రూరల్ మండలం, పాలసముద్రం మండల కేంద్రం, పరిసర గ్రామాలు, జీడీనెల్లూరు, పూతలపట్టు, గుడిపాల మండలాల్లోనూ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

సాయి సద్గురు ఫ్యూయల్ స్టేషన్ ప్రారంభం


ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులను సన్మానిస్తున్న సరితా, రమణమూర్తి దంపతులు

చంద్రగిరి, ఆగస్టు 9: చంద్రగిరి మండలం కల్‌రోడ్డుపల్లె సమీపంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన సాయి సద్గురు ఫ్యూయల్ స్టేషన్ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని ఐతేపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి ఈ ఫ్యూయల్ స్టేషన్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేతోపాటు ఆయన సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్ విచ్చేశారు. వీరికి తన సతీమణి మాజీ జడ్పీటీసీ సరితతో కలిసి ఏవీ రమణమూర్తి, ఐతేపల్లె ఎంపీటీసీ ఏసీ శేఖర్ దంపతులు స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, టీడీపీ నాయకులు వలపల దశరథనాయుడు, లోకాద్రినాయుడు, బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, చెంచయ్యనాయుడు, అగరాల జయచంద్రారెడ్డి(జేసీఆర్), ఉస్మాన్, బెల్లంకొండ రమేష్‌రాయల్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం : టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు9: మాజీ సీఎం జగన్ నోట విలువలు, విశ్వసనీయత, న్యాయం, ధర్మం, ప్రజాస్వామ్యం అనే మాటలు రావడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ విమర్శించారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లు తానే సీఎం అని జగన్ కలలు కన్నారని, కానీ ఐదేళ్లకే ప్రజలు ఆయనను ఇంటికి సాగనంపారని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో అరాచకాలు, దుర్మార్గాలు, దోపిడీలు, ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన జనం జగన్‌కు ప్రతిపక్ష హోదా అవకాశం కూడా కల్పించలేదని చెప్పారు. సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలను చూసి ఓర్వలేక జగన్, వైసీపీ నేతలు ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. నేతలు మోహన్ రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు


విశేషాలంకరణలో ఆదిపరాశక్తి - గంజి తీసుకొస్తున్న మహిళా భక్తులు

నగరి ఆగస్టు 9: స్థానిక ఓంశక్తి ఆలయంలో శుక్రవారం ఆడిమాస ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. టవర్‌క్లాక్ నుంచి మహిళా భక్తులు తలపై గంజి పెట్టుకుని ఊరేగింపుగా తీసుకొచ్చారు. 354 మంది మహిళా భక్తులు గంజి కుండలతో ఓంశక్తి పరాశక్తి మంత్రం జపిస్తూ అమ్మవారి గుడికి చేరుకున్నారు. ఏటా ఆడి మాసంలో ఓంశక్తి, ఆదిపరాశక్తి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు నిర్వాహకులు జ్యోతినాయుడు పేర్కొన్నారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు

పాలసముద్రం, ఆగస్టు 9: మండలంలోని వనదుర్గాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రాధా, రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి భజన మందిరంలో శుక్రవారం కుంభాభిషేకం వేడుకలను నిర్వహించారు. యాగశాలలో పలు పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం కలశాలను యాగశాల నుంచి అర్చకులు తీసుకొచ్చి మహాకుంభాభిషేకం నిర్వహించారు. మహాదీపారాధన చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని ఊరేగించారు.

ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేయాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఢిల్లీ ప్రసాద్

పాలసముద్రం, ఆగస్టు 9: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు పంటలను సాగు చేయాలని ఏడీ నాగపద్మిని పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సూచనలు చేశారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించరాదని అన్నారు. సేంద్రీయ పద్ధతుల్లో పంట సాగుచేస్తే నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయని తెలిపారు. వేరుశెనగ, చెరకు పంటలకు చుట్టూ ఇనుప ముళ్ల కంచెలు వేసుకోవాలని, అడవి పందుల బెడద నుంచి రక్షణ పొందేందుకు కందకాలు తవ్వించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఢిల్లీ ప్రసాద్, సర్పంచ్ మహేష్ నాయుడు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

పాలసముద్రం, ఆగస్టు 9: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పాలసముద్రం ఎస్ఐ భారతి తెలిపారు. శుక్రవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు ఎస్ఐ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ హేమలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ద్రౌపదీదేవికి రాహుకాల పూజలు


గాజుల అలంకరణలో ద్రౌపదీ అమ్మవారు

వెదురుకుప్పం, ఆగస్టు 9: కార్వేటినగరంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని గాజులతో అలంకరించారు. అభిషేకం, రాహుకాల పూజలు, కుంకుమార్చన చేశారు. అమ్మ వారిని గాజులతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సీఐగా హనుమంతప్ప బాధ్యతలు



వెదురుకుప్పం, ఆగస్టు 9: కార్వేటినగరం సీఐగా ఎస్.హనుమంతప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు నుంచి కార్వేటినగరం సీఐగా హనుమంతప్పను బదిలీ చేశారు. కాగా కార్వేటినగరం సీఐ పి.సత్యబాబును చిత్తూరు వీఆర్‌కు పంపించారు.

రాయితీతో డ్రిప్ పరికరాలు

వెదురుకుప్పం, ఆగస్టు 9: రాయితీతో ఇచ్చే డ్రిప్, స్ప్రింక్లర్లకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని వెదురుకుప్పం ఏవో సి.వనిత, ఉద్యానశాఖ అధికారిణి వింధ్య శుక్రవారం తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ, పది ఎకరాల వరకు ఉన్న రైతులకు 70 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. కార్వేటినగరం మండలంలోని రైతులు కూడా రాయితీతో ఇచ్చే డ్రిప్, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోవాలని ఆ మండల వ్యవసాయాధికారిణి హేమలత శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి


కృష్ణయ్యతో యుగంధర్

వెదురుకుప్పం, ఆగస్టు 9: జీడీ నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ సచివాలయ అసిస్టెంట్ సెక్రటరీ కేవీ కృష్ణయ్యను కోరారు. ఏపీ సచివాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి నియోజకవర్గ అభివృద్ధి విషయాలపై చర్చించామన్నారు.

వైభవంగా కాళీమాత ఆలయ మహాకుంభాభిషేకం


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, గ్రామస్తులు

తవణంపల్లె, ఆగస్టు 9: మండలంలోని వెంగంపల్లెలో నూతనంగా నిర్మించిన కాళీమాత ఆలయ మహాకుంభాభిషేకం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని అరగొండ పంచాయతీ పైమాఘంలో గ్రామస్తులు, నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. తాగునీరు, పక్కా ఇండ్లు, శ్మశానానికి దారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.